# నేలకు దిగిన నక్షత్రం

కిటికీలోంచి చూసాడు. గబగబా వెళ్ళిపోతున్నాడు. వెన్నెల్లో వెలుగులు విరజిమ్ముతూ సాగిపోతున్నాడు. చేతిలో ఏదో పుస్తకం. నన్ను లేపకుండా వెళ్ళిపోతున్నాడేం!

'ప్రకాశం' అంటూ గట్టిగా పిలిచాడు. బహుశా వినపడలేదేమో! తలుపు తియ్యబోయాడు, ఎవరో అవతల తలుపు గొళ్ళెం పెట్టినట్టున్నారు. శక్తినంతా ఉపయోగించి తలుపు దబదబమంటూ బాదాడు.

అంతలో అవతల్నించి 'శివరాంగారూ' అనే పిలుపు. నన్నెవరు పిలిచేది! నేను ప్రకాశం అంటే ఆ కేక శివరాంలా ప్రతిధ్వనిస్తోందా, అలసటతో కళ్ళు మూసుకుపోతున్నాయి. బలవంతంగా కళ్ళు తెరిచాడు.

చెమటతో శరీరం తడిసింది. పైన ఫ్యాన్ తిరగడం లేదు. కరెంటు ఎప్పుడు పోయిందో, ఎవరో తలుపు తడుతున్న చప్పుడు.

ఇంతసేపటినుంచీ, ఎవరో తలుపు కొడుతుంటే తాను కలగంటు న్నాడు, తనే తలుపు బాదినట్టుగా - నవ్వుకుంటూ లేచాడు శివరాం. తలుపు తియ్యగానే బైటనించున్న వ్యక్తి, పొడుగ్గా, పడవలా వున్న కారు, ఇంటిముందు ఆగింది. ఒక విదేశీ అత్తరు పరిమళం ముక్కు పుటాలను తాకింది. ఇంకా నిద్రమత్తు వదల్లేదు. క్రీగంటతో అతడిని చూసి మందహాసం చేసాడు. ఫోటోలో నవ్వుతున్న ప్రకాశం తనకు ఎదురుగా నవ్వు ముఖంతో వున్న ప్రకాశం కొడుకు శ్రీకాంత్, కూర్చోమంటూ సైగ చేసాడు.

ఇంత పొద్దున్నే ఈ అబ్బాయి ఎందుకొచ్చినట్టు? అతను అమెరికాలో వ్యాపారం చేస్తున్నాడు. ప్రకాశం చనిపోయిన రోజున కలిసాడు, మళ్ళీ ఈ రోజే. ప్రకాశం పోయి రెండు నెలలయినా అతడి జ్ఞాపకాలు తనని వదల్లేదు.

"ఇంత ఉదయాన్నే మిమ్మల్ని లేపి, ఇబ్బంది పెట్టినట్టున్నాను...." అన్నాడు శ్రీకాంత్.

"ఫరవాలేదు బాబూ... మా అవిడ తెల్లవారుఝామునే ఈ ఊళ్ళోనే పెళ్ళికి వెళ్ళింది. అందుకే మీరు అంతసేపు తలుపు బాదినా లేవలేక పోయాను..." అన్నాడు.

"మీకు నాన్నగారితో చాలా అటాచ్‌మెంట్ వుందనుకుంటాను చాలా సార్లు చెప్పేవారు మీ గురించి..." అన్నాడు శ్రీకాంత్.

'మాది అరవయ్యేళ్ళ అనుబంధం' అనుకుంటూ పైకి మాత్రం నవ్వుతూ వుండిపోయాడు. శ్రీకాంత్ సంభాషణ కొనసాగించాడు.

"నాన్నగారికి లిటరేచర్ అంటే చాలా ఇష్టమని మీకు తెలియంది కాదు. ఇంకో రెండు నెలల్లో ఆయన పుట్టినరోజు, ఆయనకు ముఖ్యంగా కథలంటే ప్రాణం, ఆయన పేరుమీద ఒక కథల పోటీ పెట్టి ఒకే ఒక్క బహుమతిగా పదివేల రూపాయలు ఇద్దామని ఇంట్లో అందరం కలిసి సమిష్టిగా నిర్ణయించాము" మాకు సాహిత్య విషయాల గురించి తెలీదు. ఎప్పుడూ వ్యాపారంలో క్షణం తీరిక ఉండదు. మీరు ప్రసిద్ధ కథా రచయిత అందుచేత రచయితల నుంచి కథలను సేకరించడం. వాటి నుంచి ఒక అద్భుతమైన కథను ఎంపిక చేయడం. ఇదంతా మీరు చెయ్యాలని మా ఆశ" అన్నాడు శ్రీకాంత్.

"సంతోషం. నాకు చాలా ఇష్టమైన పనే అప్పగించారు" అన్నారు ఆనందంగా శివరాం.

"థాంక్స్ అండీ... మళ్ళీ మీ దగ్గరకు వచ్చి వివరంగా మాట్లాడుతాను." అంటూ ఆ కుర్రాడు శివరాం దగ్గర నుంచి సెలవు తీసుకుని బైటకు కదిలాడు.

కారు కదిలిన రెండు నిముషాలకు, తమ ఇంటి పెరడులోని గులాబి

మొక్కవైపు దృష్టి నిలిపాడు. అప్పుడే విచ్చుకున్న గులాబిపువ్వు తీసి ప్రకాశం ఫోటో ముందుంచాడు. ఆ ఫోటో చూస్తూంటే శివరాంలో అరవయ్యేళ్ళ క్రిందటి జ్ఞాపకాలు కదిలాయి.

తనకపుడు పదేళ్ళ వయస్సు. ఇప్పుడున్న డాబా ఇల్లు స్థానంలో పాత కాలం నాటి పెంకుటిల్లు. ఆ ప్రక్కనే రావిచెట్టు సంక్రాంతి పండక్కి అందరితో పాటు తనూ గాలిపటం ఎగరేస్తున్నాడు. అన్ని పటాలకన్నా తనది బాగా ఎత్తుకు ఎగరేయ్యాలనుకునేసరికి, ఆ గాలిపటం ఎక్కడో తెగిపడి పోయింది. మిగతా కుర్రాళ్ళు చప్పట్లు కొడుతూ ఏడిపించడం మొదలు పెట్టారు. కొత్త గాలిపటం పోయిందనే దిగులుతో ఏడుస్తూ నిలుచున్నాడు. అప్పుడొక చెయ్యి తన భుజంపై పడింది. తన కన్నా కొంచెం పొడుగు, వయసులో రెండు, మూడేళ్ళు పెద్దవాడయి వుంటాడేమో. నెహ్రూగారు వేసుకునే కోటు, ఫేంటు లాంటి డ్రస్సులో కోటు గుండీకి ఒక తెల్ల గులాబితో దొరబాబులా కనిపించాడు.

తను తలెత్తి పైకి చూసాడు. ఆకాశంలో పైన స్వేచ్ఛగా ఎగురుతున్న గాలిపటం రంగురంగులతో అందంగా కనిపిస్తోంది. తను మొహమాట పడుతూ వద్దన్నాడు. “ఫరవాలేదు. తీసుకో నేను ఇంకోటి కొనుక్కుంటాను” అన్నాడు. అప్పుడు తన జేబులోని రంగురంగుల గోళీలు తీసి ఇవ్వబోయాడు. “వద్దు” అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడు. ఆ తర్వాత తెలిసింది. ఆ అబ్బాయి తమ ఇంటి ప్రక్కనున్న మేడ వారి అబ్బాయని. ఆ రోజునుంచి ప్రకాశంతో స్నేహం. తమ మధ్య వయస్సులో, అంతస్తుల్లో తేడా వున్నాబాగా కలిసి పోయారు. ఇద్దరిదీ ఒకే స్కూలు.

స్కూలు చదువు పూర్తయిన తర్వాత ప్రకాశం అదే ఊళ్లోని కాలేజీలో పియుసిలో చేరాడు. ఆ తర్వాత మరి రెండేళ్ళకు తనూ కాలేజీలో చేరడంతో తమ స్నేహం మరింత వికసించింది. ప్రకాశం సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు చదివేవాడు. తనకు చలాన్ని పరిచయం చేసాడు. కొడవటి గంటి,

గోపీచంద్, కరుణకుమార్, రావిశాస్త్రి ఇలా ఎంతమందో రచయితల రచనలను కొని తనకు చదవమని ఇచ్చేవాడు. అలా తనకు సాహిత్యాభిలాష కలిగించాడు. అలా తనకు రాయడం అలవాటయ్యింది. ప్రకాశంకు మాత్రం చదవడమే అభిరుచిగా వుండేది.

డిగ్రీలో ఉండగా ప్రకాశం తండ్రిగారు చనిపోవడంతో చదువు మానేసి వ్యాపారంలోకి దిగాడు. తమ ఊరు వదిలిపెట్టి హైదరాబాద్‌లో వ్యాపారం కొనసాగించాడు. వ్యాపారంలో క్షణం తీరుబడి లేకపోయినా సాహిత్య సేవను మాత్రం వదిలి పెట్టలేదు. హైదరాబాద్‌లో ఎన్నో సాహిత్య సమావేశాలు నిర్వహించేవాడు. చాలామంది రచయితల పుస్తకాల ప్రచురణకు ఆర్థిక సహాయం చేసేవాడు. అంకితం ఇస్తామంటే వద్దనేవాడు. అలా ప్రకాశం సాహిత్యపోషకుడిగా వుండిపోయాడు. తను మాత్రం, అతడు పరిచయం చేసిన పుస్తకాలు చదువుతూ రచయితగా ఎదిగాడు.

డిగ్రీ తర్వాత తను ఎమ్మే చేసి రెండు, మూడు ఊళ్ళల్లో కళాశాలల్లో అధ్యాపకుడిగా పనిచేసి పదవీ విరమణ తర్వాత స్వంత ఊరు చేరుకున్నాడు. వయస్సు మీద పడడంతో ప్రకాశం తన వ్యాపారాన్ని కొడుకులకు అప్పగించి తనకులాగే స్వంత ఊరుకు చేరుకున్నాడు. ఈ రెండేళ్ళలో తమ మధ్య అనుబంధం మరింత పెరిగింది. నెల క్రితం భోజనం చేసి వాలు కుర్చీలో ఏదో పుస్తకం చదువుతూ అలా నిద్రలోకి జారుకున్నాడట, సాయంత్రం ప్రకాశం శ్రీమతి టీ తీసుకువచ్చేసరికి మనిషిలో చలనం లేదు. అరవై అయిదేళ్ళ వయస్సులో ప్రకాశంది అనాయాస మరణం.

'సార్ నమస్కారం...!' ఆ పిలుపుతో ఆలోచనల్లోంచి బైటికి వచ్చేసరికి ఎదురుగా ఇరవయ్యేళ్ళ కుర్రాడు. అతడి పేరు పవన్. ఆ ఊళ్ళో జనపనార మిల్లులో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం. పాలిటెక్నిక్ చదివాడట. మిల్లులో కార్మికుడిగా పనిచేస్తూ తండ్రి చనిపోవడంతో ఇంజనీరింగ్ చదువు

దామనుకున్న ఆశ వదిలేసి తన మీద ఆధారపడ్డ అమ్మ, తమ్ముడు, చెల్లెలి కోసం ఆ మిల్లులోనే చిన్నవయసులోనే ఉద్యోగ జీవితం ప్రారంభించాడు.

రెండునెలల క్రితం తనను కలవడానికి వచ్చినపుడు, తనూ కథలు రాస్తాననీ, తన రచనలు ఎన్నో చదివాననీ, సలహాలు, సూచనల కోసం వచ్చానని చెప్పాడు. అప్పుడు తనేమన్నాడు? బాబూ... పుస్తకాలనే గురువుగా భావించు, తెలుగు కథకు ఆద్యుడైన గురజాడ నించి, నేటి రచయితల రచనలన్నీ చదువు. ముఖ్యంగా వస్తువు కోసం జీవితాన్ని, శైలి, శిల్పం కోసం సాహిత్యాన్ని చదువు అంటూ తను తనకు తోచిన సలహాలు చెప్పాడు. ఆ విషయం అంతా గుర్తుకొచ్చి "ఏంటి పవన్ విశేషాలు" అన్నాడు శివరాం.

"సార్ మీరు చెప్పినట్లే చేస్తున్నాను, ఎక్కువ చదివి తక్కువ రాస్తున్నాను" అన్నాడు.

వెంటనే శివరాం "బాబూ, ప్రకాశంగారి స్మారక కథలపోటీ ఆయన కుటుంబ సభ్యులే నిర్వహిస్తున్నారు. నెల రోజుల టైముంది, కథ రాసి పట్టుకురా నువ్వు బాగా రాయగలవని నా నమ్మకం" అన్నాడు.

"బాబోయ్ కథలపోటీకి రాయడమా" అన్నాడు పవన్.

"భలే వాడివే నీ కథలు కొన్ని చదివాను. చాలా స్వచ్ఛంగా, నిజాయితీగా రాస్తున్నావు ప్రయత్నించు" అన్నాడు శివరాం.

"అలాగే సార్" అంటూ ఆ కుర్రాడు నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

* * *

పదిహేను రోజుల తర్వాత తను ఇచ్చిన పోటీ ప్రకటనకు స్పందిస్తూ చాలామంది రచయితల నుంచి కథలు వచ్చాయి శివరాంకి. శైలి, శిల్పం, భాష, ఇతివృత్తం అనే నాలుగు అంశాలతో కథలను విశ్లేషిస్తూ వాటికి మార్కులు వేసాడు శివరాం.

"కథలు మట్టివాసన వేయాలి. కథ, జీవిత శకలాన్ని పట్టి చూపించాలి. కథ చదివిన తర్వాత అంతవరకూ తెలియని ఒక కొత్త జీవిత సత్యాన్ని తెలుసు కున్నానే అనుభూతి మిగలాలి."

ఇది కథ గురించి ప్రకాశం తనతో చెప్పిన మాటలు. ఆ దృష్టితో కథ లను తను చదివాడు. ఒకటి రెండు తప్ప మిగతా కథలు సంతృప్తి కలిగించ లేదు అనుకున్నాడు శివరాం.

మరో పదిరోజుల తర్వాత కథల పోటీకి వచ్చిన కథలను చదువుతున్న శివరాంకు "సార్" అనే పిలుపు వినిపించింది. ఎదురుగా పవన్.

"సార్ నా కథ కొంచెం ఆలస్యం అయింది" అన్నాడు.

"కూర్చోండి! అన్నాడు శివరాం."

"లేదు సార్, ఫ్యాక్టరీనుంచి పర్మిషన్ తీసుకువచ్చాను, వెళతాను" అంటూ తన కథ ఉన్న కవరు అందించి నమస్కారం చేసి బయటకు నడిచాడు.

అతను వెళ్ళిన తర్వాత అత్రంగా కవరు చింపాడు శివరాం. ముత్యా ల్లాంటి అక్షరాలు, కథ పేరు 'వైకల్యం', కథలోని వాక్యాలవెంట అతడి కళ్లు పరుగులు తీసాయి. పావుగంటలో నిశితంగా కథను చదవటం పూర్తి చేసాడు. కథ పూర్తి కాగానే ఒక్కసారిగా గుండె పొరల్లో ఏదో అలజడి, కథ చదువుతున్నంతసేపూ కథలోని మిల్లు కార్మికులు వారి 'ఆత్మఘోష' విని పిస్తున్నట్టుగా అనిపించింది. కథలో జీవిత స్పర్శ, కథనంలో ప్రవాహం, ఆ ప్రాంతపు ఉనికిని తెలియజేసే మాండలికం, ఇవన్నీ కథను ఉత్తమ కథగా నిలబెట్టాయి అనుకున్నాడు. శివరాం, కథలో జరిగినట్టు అది నిజమా అలా జరిగే అవకాశం వుందా డబ్బులకోసం శరీరంలోని అవయవాలను కోసు కుంటారా? అలా ఆలోచిస్తూ వుండిపోయాడు శివరాం.

*   *   *

ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక? ఏదారెటు పోతుందో ఎవరినీ అడగక... ఎక్కడినించో లీలగా వస్తున్న పాట నిద్ర నుంచి లేపేసరికి గబగబా మంచం దిగాడు శివరాం. వంటింట్లోంచి రోజూ మామూలుగా వినిపించే శబ్దాలు లయబద్ధంగా లేవు. వంట గదిలో కుస్తీ పడుతున్న శ్రీమతి.

"ఏమిటీ వంటావిడ రాలేదా!" అన్నాడు విషయం అర్థమై. "వేలు తెగిందట, పూర్తిగా వేలు తెగిపోయిందట మిల్లులో" అంది శివరాం శ్రీమతి.

"ఇంతకీ ఏ మిల్లులో పనిచేస్తుంది ఆవిడ" అన్నాడు.

"జనపనార మిల్లు" అంది శ్రీమతి.

జనపనార మిల్లులో వేలు తెగిందా! మనసు పొరల్లో ఏదో తాకిడి ఎక్కడో విన్నట్టో, చదివినట్టో గుర్తు వృద్ధాప్యం మీద పడుతోంది జ్ఞాపకం రాలేదు.

అన్నపూర్ణమ్మ గురించిన ఆలోచనలు! అన్నపూర్ణమ్మ సాక్షాత్తూ అన్నపూర్ణే. గత మూడేళ్ళుగా తమ ఇంట్లో వంట మనిషి, ఈ ముసలి వయసులో పిల్లలు దూరంగా ఉన్న తమకు తోడుగా అన్ని పనులూ చేసి పెడుతుంది. ఆమె తమకు జీతం తీసుకుని వంట చేసే మనిషిగా ఎప్పుడూ అనిపించలేదు. అలాంటి ఆమెకు ఎందుకు ఈ కష్టం. అనుకుంటూ

"సరే నేను బ్యాంకుకు వెళ్ళాలి. ఒకసారి చూసి వెళతాను, ఆవిడ వుండే లేబర్ కాలనీ కూడా అటువైపే కదా" అంటూ గబగబా పనులు ముగించి బైట పడ్డాడు శివరాం.

కాలనీ దాటి జనపనార మిల్లు దాటి, లేబర్ కాలనీలోకి ప్రవేశించాడు శివరాం స్కూటర్‌మీద.

ఇటు ఒకసారెప్పుడో వచ్చాడు శివరాం. ఇళ్ళను చూస్తూ వెతుకుతూంటే ఒక ఇంటి ముందు అన్నపూర్ణమ్మ కొడుకు నవ్వుతూ "సార్.... సార్" అంటూ పిలిచాడు. 'ఫరవాలేదు వీడికీ మాటలొస్తున్నాయ్' అనుకున్నాడు. ఆ

ఇరవయ్యేళ్ళ కుర్రాడిని చూస్తూ లోపలకి వెళ్ళేసరికి మంచం మీద పడుకుని వుంది. అతడిని చూసి నమస్కారం పెట్టి లేచి కూర్చుంది అన్నపూర్ణమ్మ.

చూపుడు వేలు భాగంలో గాజుగుడ్డతో బ్యాండేజి, 'ఎలా జరిగింది?' అన్నాడు శివరాం.

"మిషనులోకి జనపనార కండెలు పెడుతూంటే, కళ్ళు బైర్లు కమ్మాయి, వేలు లోపలకు పోయింది..." అంది.

ఆ మాటలకు షాక్ కలిగినట్టయింది శివరాంకు. ఈ మాటలు తను ఎక్కడయితే ఇదివరకు విన్నట్టో, చదివినట్టో అనిపించిందో ఆ విషయం గుర్తుకొచ్చింది, అదే పవన్ రాసిన కథ. ఆ కథలోని పాత్ర తన ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్నట్టనిపించి వళ్ళు జలదరించింది శివరాంకు.

"విశ్రాంతి తీసుకోమ్మా" అంటూ జేబులోంచి డబ్బులు తీసి మంచం మీదవుంచి గబగబా బైటకు నడిచాడు.

స్కూటర్ స్టార్ట్ చేసి బ్యాంకుకు బయలుదేరాడు. దారిలో మిల్లు వారి కేంటీను కనిపించే సరికి లోపలకు వెళ్లి కూర్చున్నాడు. "మంచి కాఫీ చెయ్యమ్మా" అంటూ చెప్పి ఆలోచనల్లో పడ్డాడు.

అన్నపూర్ణది బాగా బతికిన కుటుంబం. కూతురి పెళ్ళి చేసేసరికి వారి స్థితి తల్లకిందులయ్యింది. ఆడపిల్ల తర్వాత బుద్ధిమాంద్యం వున్న కుర్రాడు, మానసిక వికలాంగుల పాఠశాలలో వుంచి చదివిస్తోంది. మూడేళ్ళ క్రితం భర్త పోవడం అన్నపూర్ణమ్మకు పెద్ద దెబ్బ, భర్త జనపనార మిల్లులో పని చేసేవాడు. ఇప్పుడు అదే మిల్లులో ఆమె కూలీ, పువ్వులమ్మిన చోట కట్టె లమ్మడం.

"సార్ నమస్కారం!" అన్న పిలుపుతో తలెత్తాడు. ఎదురుగా తనకు రెండు చేతులూ జోడించిన ఆ వ్యక్తిని చూసి గతుక్కుమన్నాడు. ఆ మనిషికి బొటనవేలు లేదు. తెలిసిన ముఖం ఎక్కడో చూసినట్టు గుర్తు.

“బాబు ఏమి అనుకోకు, వేలు ఎలా పోయింది?” అన్నాడు.

“మిషనులోకి జనపనార కండెలు పెడుతూంటే కళ్ళు బైర్లు కమ్మాయి. వేలు లోపలకు పోయింది” అన్నాడు.

ఆ జవాబుకు ఆశ్చర్యం కలిగింది శివరాంకు. కొద్ది సేపటి క్రితం అన్నపూర్ణమ్మ నోటినుంచి అదేమాట! పవన్ రాసిన కథలో వేలు తెగకోసుకున్న కార్మికుడి నోటినుంచీ అదేమాట. ఆ కథలోని పాత్రలన్నీ తన ఎదురుగా వచ్చి మాట్లాడుతున్నట్టనిపించి ఆశ్చర్యానుభూతికి లోనయ్యాడు శివరాం.

కాఫీ తాగడం పూర్తి చేసి ఆలోచనల్లోనే బ్యాంకుకు చేరుకున్నాడు. విత్‌డ్రాయల్ ఫారమ్ పూర్తి చేసి టోకెన్ తీసుకుని కౌంటర్ ముందు నిలబడ్డాడు.

“సార్ లోన్ కట్టేస్తాను.” ఒక ఋణగ్రస్తుడు బ్యాంకు మేనేజరుతో అంటున్న ఆ మాటలకు అటువైపు తల తిప్పాడు.

“సంవత్సరంనించీ వాయిదాలు కట్టడంలేదు, ఇంత తొందరగా మొత్తం అప్పు ఎలా తీరుస్తున్నావ్?” అంటూ బ్యాంకు మేనేజర్ అంటున్న ఆ మాట లకు ఆ ఋణగ్రస్తుడు మౌనంగానే తన సంచీలోంచి వందరూపాయల కట్టలు తీసి మేనేజరుగారి టేబుల్ మీద వుంచాడు.

ఒక్కసారి గతుక్కుమన్నాడు శివరాం. ఆ ఋణగ్రస్తుడికి ఉంగరం వేలు లేదు.

ఇపుడు పొరలుపొరలుగా విడిపోయిన దేవరహస్యం, వేలు పోతేనేం వేలల్లో వచ్చే కాంపన్సేషన్, అందుకేనేమో, ఈ జనపనార మిల్లు కార్మికులు చాలామందికి వేళ్ళు లేవు. అలాగే అన్నపూర్ణమ్మ వేలు పోగొట్టుకుందా! బుద్ధిమాంద్యం వున్న కొడుకు భవిష్యత్తు కోసం? వీరి జీవితాల్ని కథగా మలిచిన పవన్ కథను తను అసహజంగా వుంది అనే నిర్ణయానికి ఎందు

కొచ్చాడు? తనకు ఆ జీవితాల గురించి అవగాహన లేకపోవటం వలనేనా! ఆలోచిస్తూనే ఇంటికి చేరుకున్నాడు శివరాం.

*　　*　　*

గుండ్రంగా నిలుచున్న జన సమూహం. మానవహారంగా నిలబడ్డ మనుషులు. ఎవరిచేతులకూ వేళ్ళు లేవు, "వేలు పోయినా ఫరవాలేదు, వేల రూపాయిలు కావాలి" అందరూ ముక్త కంఠంతో అరుస్తున్నారు.

దిగ్గున లేచాడు శివరాం. 'మై గాడ్, పవన్ రాసిన కథలోని పాత్రలు నిజ జీవితంలోనే కాదు కలల్లోనూ వెంటాడుతున్నాయి. అంటే ఆ కథ నన్ను అంతగా కదిలించింది! కార్మికుల జీవిత శకలాన్ని కథగా మలిచినందుకా!... ఔను ప్రకాశం ఈ కథను చదివితే తప్పనిసరిగా దీనిని ఉత్తమ కథగా ఎన్నిక చేస్తాడు. ఒక కొత్త జీవిత సత్యం ఈ కథలో ఆవిష్కరించిన పవన్ రచన వైకల్యం కథకు ఉత్తమ బహుమతి ఇవ్వాలి' అని అనుకుంటూ బహుమతి గ్రహీతగా పవన్ పేరు, అడ్రసు, ఒక కవరులో వుంచి ఆ రోజే ప్రకాశం ఇంట్లో అంద జేసాడు శివరాం.

*　　*　　*

తరువాత రోజు మార్నింగు వాక్‌లో పవన్ కనిపిస్తాడేమోనని ఎదురు చూసాడు శివరాం. అతడి కథకు బహుమతి వచ్చిందనే వార్త పవన్ చెవిలో వేద్దామనే ఉత్సాహంతో అతడు పనిచేసే ఫ్యాక్టరీకి వెళ్ళాడు. ఫ్యాక్టరీ గేటు ముందున్న సెక్యూరిటీతో, పవన్ కావాలని అడిగాడు. ఆ సెక్యూరిటీ గార్డు శివరాం వంక ఆశ్చర్యంగా చూసి, "ఆ పేరుగల వాళ్ళెవరూ లేరండి" అన్నాడు. ఆ మాటలకు శివరాంకు ఆశ్చర్యం కలిగింది.

'కొంపదీసి పవన్ అనేది కలం పేరా' బహుమతి వచ్చిందని ప్రకాశం స్మారక వేదిక వారు రాసే ఉత్తరం పవన్ పేరు మీద వెళితే అతనికి చేరు తుందా...' శివరాంలో రకరకాల ఆలోచనలు 'ఫరవాలేదు పేపరు ద్వారా,

వచ్చే నెల బహుమతి ప్రధానం అని సమాచారం అందుతుంది కదా...' అనుకుని సమాధానపడ్డాడు.

రెండు రోజుల తర్వాత ఊళ్ళోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ప్రకాశం జన్మదిన వేడుకలు ప్రారంభమయినాయి. ఒక రాజకీయ ప్రముఖుడు ఇంకా కొంతమంది పారిశ్రామిక వేత్తల సరసన శివరాంను కూర్చోపెట్టారు. సభ మొదలయింది. శివరాం, సభంతా కళ్ళతో చుట్టేడు పవన్ రాక కోసం, అతడి జాడలేదు. వేదిక మీద వున్న వారి ఉపన్యాసాలు అయిపోయాయి. శివరాం వంతు వచ్చింది. ప్రకాశం చేసిన సాహిత్యసేవ గురించి, అతడి వ్యక్తిత్వం గురించి మాట్లాడాడు. మాట్లాడుతున్నంతసేపూ అతడి కళ్ళు పవన్ కోసం ఎదురుచూస్తున్నాయి. ఇక తన ఉపన్యాసం ముగించే దశలో కనిపించాడు. చివరి బెంచీలో కూర్చున్న పవన్, 'అమ్మయ్య' అని నిట్టూర్చాడు. అతడిలో అంతవరకూ పెరిగిన మానసిక సంక్షోభం తగ్గింది. ఊపిరి పీల్చుకున్నాడు. "కథల పోటీలో బహుమతి సాధించిన విజేత పేరు శ్రీకాంత్ ప్రకటిస్తారు అంటూ తన ఉపన్యాసం ముగించాడు శివరాం. శ్రీకాంత్ వేదిక మీదకు వచ్చాడు. "చాలా కథలు పోటీ నిమిత్తం వచ్చాయి. వాటిని శివరాం పరిశీలించి ఒక ఉత్తమ కథను ఎన్నిక చేసారు." అంటూ బహుమతి గ్రహీత పేరు చెప్పగానే శివరాం ముఖం పాలిపోయింది. తన శరీరంలోని రక్తాన్నంతా ఎవరో లాగేసినట్లుగా బాధకు గురయ్యాడు. అతడికి కోపం, దుఃఖం ఏకకాలంలో కలిగాయి. తను విజేతగా ఎన్నిక చేసిన పవన్ పేరు పిలువ లేదు.

శ్రీకాంత్ తన ఉపన్యాసం కొనసాగిస్తూ....

'బహుమతి గ్రహీత' శ్రీమతి రజనీ ప్రభాకర్. ప్రముఖ పారిశ్రామిక వేత్త ప్రభాకర్ గారి సతీమతి. చిన్నప్పటినుంచి తెలుగు బళ్ళో చదువు కోలేకపోయినా, స్వయంగా తెలుగు నేర్చుకుని ఈ స్థాయికి ఎదిగారు. ఆవిడ రాసిన కథ 'జారుడు మెట్లు' కథకు ప్రథమ బహుమతి" అంటూ శ్రీకాంత్

మైకులో చెప్పగానే శివరాంకు మనసంతా మొద్దుబారిపోయింది. మౌనంగా ఉండిపోయారు.

ఐదు నిముషాలలో బహుమతి గ్రహీత రజనీ ప్రభాకర్‌ను వేదిక మీదకు పిలవడం, శాలువా కప్పడం, పదివేల రూపాయలున్న కవరు అందించడం చక చక జరిగిపోయాయి. వెంటనే శ్రీకాంత్, శివరాం దగ్గరకు వచ్చిన మెల్లగా, "సారీ అంకుల్! ఆఖరి సమయంలో బహుమతి గ్రహీతను మార్చవలసి వచ్చింది. ఈవిడ భర్త మనకు బాగా కావలసినవారు, మాకు అమెరికాలో వ్యాపార లావాదేవీల్లో చాలా సహాయపడుతున్నారు..." అన్నాడు.

ఆ మాటలు వినలేకపోయాడు శివరాం. ఆ తరువాత శివరాంకు శాలువా కప్పారు. మెడలో గులాబీల దండ వేసారు, పళ్ళు, పుష్పగుచ్ఛం ఇచ్చారు. కథల పోటీకి న్యాయనిర్ణేతగా వున్నందుకు పారితోషికంగా డబ్బులుంచిన కవరు అందించారు. 'నాకెందుకీ సన్మానం, బహుమానం, కథల పోటీలో విజేతను నేను ఎంపిక చెయ్యలేదు కదా' అందామనుకున్నాడు. తన బాల్యమిత్రుడి స్మృతిగా ఏర్పాటయిన ఆ ఉత్సవం రసాభాస కాకూడదని మౌనంగా వుండి పోయాడు. సభ పూర్తయింది. శివరాంకు అక్కడ వుండా లనిపించలేదు. వేదిక దిగి గబగబా బయటకు వచ్చాడు. "అంకుల్ డిన్నర్ చేసి వెళుదురుగాని" అంటూ శ్రీకాంత్ తమ్ముడు ఎదుట పడ్డాడు. "ఫరవా లేదు ఇంటికి వెళతాను" అంటూ వేగంగా ఆ సభా ప్రాంగణంనించి బైట పడ్డాడు.

నడుస్తున్న శివరాం మనసులో బాధ సుళ్ళు తిరుగుతోంది. ఆ రోడ్డు దాటి మలుపు తిరిగేటంతలో ఏదో టీ షాపు ముందు నుంచుని "తినడాని కేమైనా వుందా" అని అడుగుతున్న పవన్ కనిపించాడు.

"అబ్బే ఏమీ లేదు టైమైపోయింది కదా!" అంటూ ఆ టీ షాపు వారి మాటలతో నిరాశగా వెనుతిరిగిన పవన్‌ని చూస్తూ "ఏం బాబూ ఆకలేస్తున్న ట్టుంది. ఈ టైములో ఏమి దొరకవు. ఇదిగో ఈ పళ్ళు తిను" అంటూ సభలో

తనకు ఇచ్చిన పళ్ళను అందించాడు. 'వద్దండీ!' అంటూ మొహమాటంగా చూసాడు.

"ఫరవాలేదు తీసుకో!" అన్నాడు. పవన్ గబగబా పళ్ళు తింటున్నాడు. శివరాంకు అతడిని చూసి జాలేసింది.

అతను పళ్ళు తినటం పూర్తి చేసి "థేంక్సండీ... వస్తాను" అంటూ ముందుకు కదిలాడు.

"నేనూ వస్తాను.... పద.." అంటూ శివరాం అతడిని అనుసరించాడు. శివరాంకు ఏదో సంకోచం. అతడికి బహుమతి ఇప్పించలేకపోయాననే బాధతో...

"కథ బాగా రాసావ్... అంత సజీవ చిత్రంలా కథను ఎలా నిలప గలిగావ్" అన్నాడు శివరాం.

"అది మా కథే సార్.. మా నాన్న కథ.... ఒక కార్మికుడి కథ" మా నాన్నలాంటి చాలామంది కార్మికుల కథ అన్నాడు.

"అంటే" అర్థం కానట్టూ చూసాడు శివరాం.

"మా నాన్న నన్ను ఇంజనీరు చేద్దామనుకున్నాడు. అందుకు అప్పులు చేసాడు. ఒక కార్మికుడికి అది అంత సులువైన పని కాదని తెలిసింది. వేలు పోతే 'వేలే' వస్తాయి. అనుకొని వేలు పోగొట్టుకున్నాడు, చాలామంది కార్మికుల్లా అయితే మా నాన్నకున్న షుగర్ జబ్బు ఆ వేలుతో ఆగలేదు, మొత్తం శరీరం తినేసింది, వేలుతోపాటు ఆయన పోయాడు సార్" పవన్ మరి చెప్పలేకపోయాడు.

తండ్రి ఆత్మఘోషను ఇంకా అలాంటి కార్మికుల మనోవేదనను అక్షరాలలో ఆవిష్కరించిన పవన్ కథకు బహుమతి రాకపోవడం శివరాంలో బాధ పుండులా సలిపింది. 'ఈ సమయంలో ప్రకాశం వుంటే ఏం చేసేవాడు?' అనుకున్నాడు.

చిన్నప్పుడు తన గాలిపటం తెగిపోతే తనది ఇచ్చేసాడు. దుఃఖపడుతున్న తనని ఓదార్చాడు. అదే తను ఇప్పుడు చేయాలి, అనుకుంటూ, పవన్ ఒక్క నిమిషం...." అన్నాడు. నడుస్తున్న అతడు ఆగాడు.

"పవన్ నీ కథలో జనపనార మిల్లు కార్మికులు వైకల్యం కొని తెచ్చుకున్నారు. తమ సమస్య తీరడానికి, అయితే ప్రకాశం స్మారక కథల పోటీ నిర్వహించిన వారికీ వైకల్యం వుంది. ఇంకా పైకి వెళదామనే ప్రయత్నంలో ఏదో పోగొట్టుకుంటున్నారు, అయితే అది పైకి కనపడదు... ప్రకాశం ఆత్మ ఘోషించేలా వారీ పని చేసారు. అయితే నేను అతడి 'ఆత్మను సంతృప్తి పరుస్తాను." అంటూ తనకు సభలో ఇచ్చిన శాలువా అతడికి కప్పాడు. తనకు వేసిన గులాబీ దండ అతడి మెడలో వేసాడు. తనకు పారితోషికంగా ఇచ్చన డబ్బులున్న కవరు అతడి జేబులో వుంచాడు.

పవన్ అతడి వైపు ఆశ్చర్యంగా చూస్తూ రెండు చేతులూ జోడించాడు.

"ఇది నేను చేస్తున్న సన్మానం కాదు, పైనుంచి ప్రకాశం చేస్తున్నాడు, ఇంతకీ నీ కలం పేరు పవన్, అసలు పేరు ఏమిటి?" అన్నాడు శివరాం.

"నా అసలు పేరు 'ప్రకాశం' సార్ అన్నాడు.

ఆ మాటలకు శివరాం, విస్మయంగా ఆ కుర్రాడి వంక చూస్తూ, 'ఒక ధృవతార ఆకాశంలో ప్రకాశిస్తూ వుండి పోయింది, మరో తార నేలకు దిగింది' అనుకున్నాడు, అంతలో అతడికి ఎవరో మహానుభావుడు చెప్పిన మాట గుర్తుకు వచ్చింది.

'తనని గుర్తించాలని యాచిస్తూ
నక్షత్రం లోక సంచారం చెయ్యదు
లోకమే దాన్ని వెతుక్కుంటూ వెళుతుంది'

(రంజని 2011 నందివాడ భీమారావు కథల పోటీలో ప్రథమ బహుమతి, ఆంధ్రప్రదేశ్ మాస పత్రికలో ప్రచురణ)